ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శనివారం 22 జూన్, 2024 | పేజీలు : 5

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు ఇవ్వాలి



**ప్రజాపక్షం/నల్లగొండ:** అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని టియూడబ్ల్యూజె (ఐజెయు) నల్లగొండ జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిని కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ పట్టణం ,

మిగతా 5లో...

# దుక్కి దున్ని..విత్తనం వేసి..

### వాన కోసం ఆకాశం వైపు అన్నదాతల చూపులు



**ప్రజాపక్షం/ నిడమనూరు:** చినుకురాలదు చింత తీరదు..ఆకలి చావదు.. ఆశ తీరదు ఇది అన్నదాత దుస్థితి.. గత రెండు మూడు సంవత్సరాలుగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల మూలంగా తీవ్రంగా నష్టపోయిన రైతన్న తిరిగి సేద్యంపై కోటి ఆశలతో దుక్కులు దున్ని విత్తనం వేసి వానకోసం ఆకాశం వైపు చూస్తూ అంగలార్చడం తప్ప అన్నదాత ముఖంలో ఆనందం కనుచూపుమేరలో కనిపించడం లేదు.వర్షాభావ పరిస్థితుల మూలంగా మునుపెన్నడూ లేని విధంగా బోరు బావులు పూర్తిగా అడుగంటి పోవడంతో వందల బోర్లు వేసినప్పటికీ వ్యవసాయం చేసేందుకు సాయం చేయాల్సిన పాతాళ గంగ పైకి రాకపోవడంతో రైతు కంట కన్నీటి గంగా ఉప్పొంగి రైతు కుంగిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి, మండలంలోని ఆయకట్టు నాన్ ఆయకట్టు అన్న తేడా లేకుండా వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు సేద్యం ముందుకు సాగగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్ లో పంటలు సాగు చేసేందుకు నానాయకట్టు ప్రాంతంలో ఇప్పటికే రైతులు దుక్కులు దున్ని మెట్ట పంటలు సాగు చేసేందుకు విత్తనాలు వేయడం జరిగింది. ప్రారంభంలో కురిసిన వర్షాలకు వేసిన విత్తనం తర్వాత వర్షాలు లేకపోవడంతో కొన్ని గింజలు మొలకెత్తకపోగా మొలిచిన గింజలకు వర్షాలు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. ఆయకట్టు ప్రాంతంలో ప్రధానంగా పత్తి, కంది, జొన్న, పెసర, బొబ్బెర పంటలను సాగు చేస్తుంటారు. అదేవిధంగా బోరుబావుల కింద వరి సాగు చేసేందుకు దుక్కులు దున్ని నారుమల్లను సిద్ధం చేసుకున్న ప్పటికిని వర్షాభావ పరిస్థితుల మూలంగా భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరు బావులు ఆగిపోస్తూ రైతుకు కంటిపై కొనుక్కు లేకుండా చేస్తున్నాయి. గత సీజన్లో వేసిన పంటలు ఎండిపోవడంతో పశువులను మెప్పుకోవడం జరిగింది. పండ్ల తోటలు సాగు చేసిన అనేక మంది రైతులు తోటలు ఎండిపోతుండడంతో భగవంతుని తిట్టుకుంటూ మౌనంగా రోదించారు. అదేవిధంగా ఆయకట్టు ప్రాంతంలో సైతం ఆ ప్రాంత రైతులు ప్రధానంగా సాగు చేసే వరి పంట సాగుకు నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా సాగునీరు ఎప్పుడు అందుతుందో అన్న ఆందోళనతో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. సాగర్ నిండుతుందా ఎడమ కాలువకు నీటి విడుదల జరుగుతుందా అన్న ఆందోళన ఆయకట్టు రైతుల్ని వేధిస్తుంది.ఆయకట్టు రైతులు సైతం ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు సిద్ధం చేసి పెట్టుకున్నారు. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రైతులు కూలీలుగా పట్టణ ప్రాంతాలకు వలసలు పోక తప్పదని రైతులు రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# ప్రైవేట్ స్కూళ్లలో యథేచ్ఛగా బుక్స్ అమ్మకాలు

### పుస్తకాల పేరుతో వేల రూపాయలు వసూళ్లు
### విద్యార్థులు తల్లిదండ్రులు నిలువు దోపిడీ
### అధికారులు సహకరిస్తున్నారని ఆరోపణలు

**ప్రజాపక్షం/మోత్కూర్ :** ప్రవేట్ స్కూల్ యాజమాన్యాల ఆగడాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయి. నోట్ బుక్స్, యూనిఫార్మలు, పుస్తకాల పేరుతో తల్లిదండ్రులను నిలబెట్టి దోపిడీకి చేస్తున్నారు. మోత్కూరు మున్సిపాలిటీలో ఉన్నటువంటి ప్రైవేట్ స్కూల్స్ నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ ఆవరణలో బుక్ స్టాల్స్, బట్టల దుకాణాలు తెరిచారు. స్కూల్ ఆవరణలో విక్రయించకూడదని నిబంధన ఉన్నప్పటికీ స్కూల్ యాజమాన్యాలు కొన్ని, స్కూల్ ఆవరణలోనే స్టాల్ ఏర్పాటు చేసి, తల్లిదండ్రుల నుండి వేల సంఖ్యలో వసూలు చేస్తున్నారు. డబ్బుల కోసమే ఐఐటి పుస్తకాలను విద్యార్థులకు అంటగడుతున్నారు. స్కూల్ యాజమాన్యాల దోపిడీకి తల్లిదండ్రులు ఆర్థికంగా నలిగిపోతున్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల పుస్తకాల వ్యాపారానికి విద్యాశాఖ అధికారులు తన వంతు సహకరం అందిస్తున్నారని, ఆరోపణలు ఉన్నాయి. మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో ఒక ప్రైవేట్ స్కూలుకు సంబంధించి, బుక్కులు అమ్మిన బిల్లు సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతుంది. సికస్త్ క్లాస్ చదువుకునే విద్యార్థికి కేవలం గైడ్స్ కోసమే రూ.7500 తీసుకున్నట్లు దాంట్లో కనిపిస్తుంది. కేవలం గైడ్స్ కోసమే రూ. 7500 కావడం ఏంటని విద్యార్థులు తల్లిదండ్రులు విస్తు పోతున్నారు. ప్రవేట్ స్కూల్ యాజమాన్యాలు తరగతి పాఠ్యపుస్తకాలు కాకుండా గైడ్స్, ఐఐటి సంబంధించిన బుక్స్ అని, విద్యార్థులకు అంటగడుతు, వేల సంఖ్యలో వసూలు చేస్తున్నారని విద్యార్థులు తల్లిదండ్రుల నుండి ఆరోపణలు వస్తున్నాయి. పాఠ్యపుస్తకాల విక్రయాలు, ఫీజుల వసూలు విషయాలను విద్యార్థి సంఘాలు అనేక మార్లు ధర్నాలు నిర్వహించి, విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలు అందించినప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లకుండా మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించిస్తున్నారు. మోత్కూర్ మున్సిపాలిటీ లో ప్రతి ప్రైవేట్ స్కూల్లో బుక్ స్టాల్ ఏర్పాటు చేసి, విక్రయిస్తున్నప్పటికీ, బుక్స్ కొనుగోలుకు సంబంధించిన రసీదులు సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతున్న, మండల విద్యాశాఖ అధికారులు దృష్టికి రాలేదు అనడం గమనార్హం.




**పాఠ్యపుస్తకాలు విక్రహిస్తే కఠిన చర్యలు**

శ్రీధర్ ( మండల విద్యాశాఖ అధికారి మోత్కూర్)

ప్రైవేట్ స్కూళ్లలో బుక్స్, విక్రయించకూడదని నిబంధనలు ఉన్నాయి. మోత్కూరు ప్రైవేట్ స్కూళ్లలో బుక్స్ విక్రయిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. స్కూల్ ప్రారంభంలోనే అన్ని ప్రైవేటు స్కూలుకు డిఇఓ దగ్గర నుండి వచ్చిన సర్క్యులర్ సర్వ్ చేశాము. నిబంధనలు కాదని, బుక్స్ విక్రయించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటాము.

### నెంబర్ ప్లేట్లు లేకుండా

# వాహనాలు నడిపితే చర్యలు తప్పవు




### జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ 551 వాహనాలపై కేసులు నమోదు : ఎస్పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లాలో వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా నడపవద్దని, ప్రతి రోజూ జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనల విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయబడుతాయని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 551 వాహనాలను పట్టుబడి చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో చాలా మంది వాహనదారులు తమ వాహనాలకు నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలపై ప్రయాణిస్తున్నారని ఇకనైనా తమ వాహనాలకు నంబర్ ప్లేట్స్ ప్రభుత్వం నిర్దేశించిన విదంగా ఉండాలని అన్నారు. కొంత మంది నంబర్ ప్లేట్ లేకుండా వాహనాల నడుపుతూ అనేక నేరాలకు, దొంగతనాలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రతి వాహనానికి నంబర్ స్పష్టంగా కనిపించే విధంగా నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని లేని యెడల యుఎస్ 80( ఎ) 177 ఎంవీ ఆక్ట్ క్రింద కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు.

## యోగా ప్రతి మనిషి జీవితంలో ఒక భాగం కావాలి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** యోగా దినోత్సవాన్ని పురస్కరించుకోని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ప్రదీప్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి చందనలు మాట్లాడుతూ యోగా అనేది మానసికంగా, శారీరకంగా దృఢత్వాన్ని ఇస్తుందని, బీపీ, షుగర్ వంటి వ్యాదుల నియంత్రణకు ఉపయోగపడుతుందన్నారు. యోగ ఆసనాలు వేయడం ద్వారా ఉపయోగాలు ఉన్నందున ప్రజలందరు నిత్యం యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి.మజీద్, ప్రభాకర్, బర్ల డేవిడ్, బాతరాజు అశోక్‌కుమార్, మామిడి వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి సూపరింటెండెంట్ నారగోని గంగాభవాని, అడిషనల్ జూనియర్స్ వరాజు, కోర్టు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాతో శారీరక మానసిక రుగ్మతలను జయించవచ్చు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్:** ప్రతిరోజు యోగా సాధన చేయడం ద్వారా మానసిక,శారీరక రుగ్మతలను ఎన్నో జయించవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ పుష్పలత అన్నారు.శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఆరోగ్య కేంద్ర సిబ్బంది గర్భిణీలకు,రోగులకు,ప్రజలకు యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరక ,మానసిక ఆరోగ్యాన్ని పెంచే సాధనంగా యోగ పనిచేస్తుందన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం 2024 మహిళా సాధికారత కోసం యోగా అనే థీమ్ ద్వారా మహిళలు సంతోషకరమైన జీవితాన్ని ప్రేరేపించడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు ఆమె తెలిపారు.కార్యక్రమంలో హెచ్ ఈవో గజగంటి ప్రభాకర్, సూపర్ వైజర్ సిహెచ్ పద్మ,ఆరోగ్యసిబ్బంది,ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ వర్థంతి వేడుకలు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రధాత అయిన ప్రొఫెసర్ జయశంకర్‌సార్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ సంక్షేమ సంఘం కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులుధూళిపాళ ధనుంజయనాయుడు,ప్రధాన కార్యదర్శి రాపోలు నవీన్ మాట్లాడుతూ తెలంగాణ కోసం తన యావత్ జీవితాన్ని జయశంకర్‌సార్ అంకితం చేశారన్నారు.తెలంగాణ స్థితి గతుల,భౌగోళిక పరిస్థితుల పట్ల నిరంతర ఉద్యమాలు సాగించి తెంగాణపోరాట స్ఫూర్తిగా ప్రధాతగా జయశంకర్ చరిత్రలో నిలిచి పోయారన్నారు.నీళ్లు,నిధులు,నియమాకాలుఅనేఅంశాలను జయశంకర్ సార్ తెలంగాణ ఉద్యమానికి అందించారని వారు గుర్తు చేశారు.తెలంగాణ స్వాతంత్ర్య ఫలాలు అందరికి అందుబాటులో తేవడమే జయశంకర్‌సార్‌కు ఇచ్చే ఘనమైన నివాళని వారన్నారు.కార్యక్రమంలో సంఘం నాయకులు తక్కెళ్ల నాగార్జున,తునికపాటి జగన్నాధచారి,రావుల సత్యం,కర్రి సతీష్ రెడ్డి,ఊదర వెంకన్న, కొమ్రరాజు వెంకట్, మీరా,అయిల శ్రీను, మన్నెం రాంబాబు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నిత్యం యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సేవా భారతి సభ్యులు మెట్టు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం శ్రీ సరస్వతి శిశుమందిరర్ ప్రాంగణం నందు సేవాభారతి,లైన్స్ క్లబ్,వాసవి వనితా క్లబ్,ఇంపాక్టు క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.యోగా పితామహుడు పతంజలి మహర్షిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగాతో పాటు సాత్విక ఆహారంతో మంచి జీవనశైలి అలవర్చుకోవాలన్నారు.యోగ అనేది ఒకసారి ఎక్కువగా చేయకుండా శరీరతత్వాన్ని బట్టి వయస్సు బట్టి నిదానంగా రోజువారి పెంచుకుంటూ సాధన చేయాలన్నారు.యోగా కార్యక్రమంలో చల్లా శ్రీలతారెడ్డి,చల్లా ప్రభాకర్‌రెడ్డి,బట్టు మధు,పార్ధనబోయిన విజయ్‌కుమార్, సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి,వీరవల్లి శ్రీలత,మాశెట్టి మోహన్,నీల శ్రీనివాస్,సభావత్ రాము,జెగిని సురేష్ బాబు,జూలూరి అశోక్,కందిబండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మిర్యాలగూడలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యోగా దినోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థులు యోగా ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతిరోజు విద్యార్థులు యోగా చేయడం వల్ల అభ్యాసన సామర్థ్యం మెరుగుపడుతుందన్నారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటరమన, సునంద, కోటయ్య, నరేందర్ రెడ్డి, ఫ్రాన్సిస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా యోగా క్లబ్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో పలువురు నాయకులు యోగా చేశారు. కార్యక్రమంలో గురూజీ చీదళ్ల వెంకటేశ్వర్లు, కోల సైదులు, కంచర్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, పంతులు నాయక్, దయాకర్‌రెడ్డి, వంగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపాల్ కెకె.జయరాజన్ ఆధ్వర్యంలో విద్యార్థులు యోగా ఆసనాలు చేశారు. కార్యక్రమంలో సుజయ్‌కుమార్, మధునాయర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీ ప్రకాశ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కరస్పాండెంట్ కొలిపాక రమాకాంతరావు, ప్రిన్సిపాల్ కె.శారద ఆధ్వర్యంలో విద్యార్థులు యోగా ఆసనాలు చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, జోజి, ప్రకాశ్, గిరిధర్‌రావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ముట్టడి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** నీట్ పరీక్ష పేపర్ల లీకేజీపై సుప్రీం జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ రేపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముట్టడిని విజయవంతం చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ విక్రమ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంబిబిఎస్‌తో పాటు ఇతర వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యుజీ ఎంట్రన్స్ పరీక్ష లీకేజిపై దేశ వ్యాప్తంగా విద్యార్థులు, వారు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్న ప్రధాన మంత్రి స్పందించకపోవడం శోచనీయమన్నారు. బిహార్‌లో రూ. 30లక్షలకు నీట్ ప్రశ్నపత్రాలు విక్రయించారని అరెస్టులు అవుతున్న కేంద్ర ప్రభుత్వం నిమ్మకునీరేత్తనట్లుగా వ్యవహరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి పరీక్షలు తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థి, యువజన సంఘాలతో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో పిడిఎస్‌యు నాయకులు సూరం విజయ్ రెడ్డి, ఉపేందర్, వీరేష్, వీరబాబు, పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం




**ప్రజాపక్షం/సూర్యాపేట:** నీట్ పరీక్ష పత్రం లీకేజీతో విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాడం ఆడుతుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దనియాకుల శ్రీకాంత్ వర్మ, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేబోయిన కిరణ్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక 60ఫీట్ల రోడ్డులో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష పత్రాల లీకేజీపై సుప్రింకోర్టు సట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. భాజపా పాలిత రాష్ట్రాలు బీహార్, హర్యానా, గుజరాత్‌లో పేరర్లు లీకైనట్లు వస్తున్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరైంది కాదన్నారు. వైద్య వృత్తిపై ఎంతో ఆశతో లక్షల రూపాయలతో కోచింగ్ తీసుకొని చదువుకున్న విద్యార్థులకు నిరాశ మిగిలిందన్నారు. పేపర్ లీకేజీలపై విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు నల్లగొండ నాగయ్య, ధరావత్ రవి, షెక్ జహంగీర్, తాళ్ళ వినయ్, పిడమర్తి భరత్, సాయి దీపక్, అభినయ్, తేజ, వరుణ్, లోకేష్, జగదీష్, సాత్విక్ పాల్గొన్నారు.

## నీట్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మే 5 న ఎంబీబీఎస్,ఇతర వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిం చిన నీట్‌యూజీ 2024 ఎంట్రన్స్ లో జరిగిన పేపర్ లీకేజీ ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్పందించకపోవడం సిగ్గుచేటని, దీనికి బాధ్యత వహించి నీట్ విద్యార్థుల కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించి దేశ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మురళి కృష్ణ, పిడిఎస్‌యు రాష్ట్ర బాధ్యులు ఇందూరు సాగర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్‌లు పాల్గొని మాట్లాడుతూ బిహార్ లో రూ.34 లక్షలకు నీట్ ప్రశ్నపత్రాలు విక్రయించారని,ఈ వ్యవహారంలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నప్పటికీ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం నిమ్మ కు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని బీజేపీ మోడీ ప్రభుత్వం పై వారు మండిపడ్డారు.నిట్ పరీక్ష ఫలితాలలో 67 మందికి మొదటి ర్యాంకు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని ,విద్యార్థులకు,దేశ ప్రజలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదా నాయక్,ఏఐఎస్ఎఫ్ సూర్య తేజ,జగన్ నాయక్,వీరన్న,తరుణ్,సిపాయి, పిడిఎస్‌యు జిల్లా నాయకులు ఎన్. రామకృష్ణ, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేవాలయంలో గోమాతకు ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్:** మండలంలోని బూరుగడ్డ గ్రామంలోని శ్రీఆదివరాహలక్ష్మీ నరసింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు హరీష్ కుమార్‌చార్యులు శుక్రవారం గోమాతకు ప్రత్యేక పూజలను నిర్వహించారు.అనంతరం శ్రీగోదావేణుగోపాల భజనమండలి వారిచే భజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎమ్.పి లక్ష్మణ్‌రావు, కూన్‌రెడ్డి మీనారెడ్డిధనలక్ష్మీ, యరగాని గోపాలం, గురవయ్య, లింగయ్య, రాంబాబు, గుండు నరేష్, అనసూర్య, లక్ష్మీ, అరుణమ్మ ,ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి, కిరణ్‌గౌడ్, రమేష్, ఉపందర్, భక్తులు పాల్గొన్నారు.

## అవసర నిమిత్తమై బస్సు ఎక్కండి ... ఉచితంగా బహుమతి పొందండి




**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** మహిళలు బస్సు ఎక్కి ఉచిత బహుమతులు పొందాలని ఆర్టీసీ డీఎం పాల్ అన్నారు. ఇటీవల ఆర్టీసీ డిపో వారు విజయవాడ రూట్‌లో నడిపిస్తున్న డీలక్స్ బస్సుల్లో మహిళా ప్రయాణీకుల ఆకర్షణ నిమిత్తం జీవీ.మాల్ సౌజన్యంతో ప్రారంభించిన బస్సు ఎక్కండి బహుమతి పొందండి ప్రారంభించారు. మూడవ విడతగా శుక్రవారం డ్రా నిర్వహించగా పలువురు మహిళలకు బహుమతులు అందచేశారు. ప్రతి ఒక్కరు ఆర్టీసీ సంస్థకు సహకరించాలని ఆయన కోరారు.

## ప్రజావాణిలో పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** ప్రతి సోమవారం ఉదయం 10.30 నిమిషాల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రజలు తమకు లభించనటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలైన గ్యాస్ సబ్సిడి, కరెంట్ బిల్ సబ్సిడి ఇతర సమస్యల పరిష్కారం కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడివో రాంరెడ్డి, ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో మండల ప్రజలను కోరారు. సరైన ధృవ పత్రాలతో తమ సమస్యల పరిష్కారానికి ఎంపిడివో కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే అధికారులు వాటి పరిష్కారానికి మార్గం చూపుతారని వారు పేర్కొన్నారు.

## ఉచిత పుస్తకాల పంపిణీ

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : భువనగిరి పట్టణంలోని రాంనగర్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, 8వ వార్డ్ కౌన్సిలర్ పంగ రెక్క స్వామి ఆధ్వర్యంలో ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదండంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా పంపిణీ చేస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యోగ దినోత్సవం

ప్రజాపక్షం/భువనగిరి : యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం భువనగిరి పట్టణంలో రాంనగర్ వాకర్స్ అసోసియేషన్ తరపున యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ గునుగుంట్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు చింతకింది కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు సాబన్నార్ వెంకటేష్, సభ్యులు చామల వెంకటనారాయణరెడ్డి, కీమోజు మల్లికార్జున చారి, పడాల భాస్కర్, యాదగిరి, కీసరి ఉపేందర్ రెడ్డి, మందడి శ్రీనివాస్ రెడ్డి, పి.శంకర్ రెడ్డి, పంజాల రాజు, కొండ శ్రీనివాస్, పి.రవీందర్, యాదగిరి, ఇస్తారి, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : భువనగిరి మున్సిపాలిటీ శివారులో గల రాయగిరి ప్రాంతంలో ఉన్న యూనిటీ ఫార్మసీ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడితే కుటుంబం పైన తన పైన సమాజం పైన పడేటువంటి దుష్ఫలితాల గురించి విద్యార్థులకు తెలిపారు. అలాగే చట్టపరమైన చర్యల గురించి కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ కుమార్, యూనిటీ కళాశాలల డైరెక్టర్ పి.గోవర్ధన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, యూనిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సరిత, ఏవో సునిత, బోధన, బోధ నేతరా సిబ్బంది పాల్గొన్నారు.

## నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలం

ప్రజాపక్షం/ఆలేరు : దేశవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర విద్యా శాఖ మంత్రి ఘోరంగా వైఫల్యం చెందారని టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నీట్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాదులోని ఎల్బీ స్టేడియం ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువకులు, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడం మానుకోవాలని హితవుపలికారు. లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## బొంగు చంద్రయ్య సేవలు మరువలేనివి



ప్రజాపక్షం/ సంస్థాన్ నారాయణపురం : మండలంలోని జనగాం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు బొంగు చంద్రయ్య(89) గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ 19తేదీన రాత్రి తుది శ్వాస విడిచారు. చంద్రయ్య మృతదేహానికి సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, సిపిఐ నల్గొండ జిల్లా కార్యదర్శి సత్యం హాజరై పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మ బిక్షం, గులాం రసూల్ తో కలిసి అనేక పోరాటాల్లో చంద్రయ్య పాల్గొన్నాడనిగుర్తు చేశారు. పార్టీ అభివృద్ధికి, ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా చివరి వరకు కమ్యూనిస్టుగానే బ్రతికిన గొప్ప కమ్యూనిస్టు చంద్రయ్య అని ఆయన సేవలు మరువలేనివని అన్నారు. జనగాం గ్రామంలో గీతా పనివార్ల సంఘం మొట్టమొదటి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి సంఘం బలోపేతానికి గీతా కార్మికుల హక్కులకై ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె శ్రీనివాస్, సిపిఐ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ దేశిడి నరేందర్ రెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి జగన్, ప్రజానాట్యమండలి కళాకారులు అమరవీరుల గేయాలు ఆలపించారు.

## ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణం



ప్రజాపక్షం/బీబీనగర్ : బీబీనగర్ మండలంలో ఉన్న మాదారం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలతో పాటు పలు గ్రామాల్లో పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉందని ధర్మ సమాజ్ పార్టీ మండల నాయకులు వెలువర్తి శ్రీకాంత్ మహారాజ్ అన్నారు. మాదారం గ్రామానికి చెందిన తన సోదరుడు దివంగత వెలువర్తి సాయి కిరణ్ జయంతి సందర్భంగా గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్‌ను శ్రీకాంత్ ఆధ్వర్యంలో పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మహారాజ్ మాట్లాడుతూ మండల శివారు గ్రామమైన మాదారం గ్రామ పాఠశాల పరిస్థితి దుర్భరంగా ఉందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా ఉండడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ప్రభుత్వం విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను నిజంగా మార్చాలని అనుకుంటే రాష్ట్ర బడ్జెట్లో ప్రతి సంవత్సరం 33 వేల కోట్లు విద్యా రంగానికి కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.అచ్చు నాయక్, ఉపాధ్యాయురాలు ఎండి.రిజ్వాన బేగం, అంగన్వాడి టీచర్ ధనలక్ష్మి, శివ శంకర్, పాల్గొన్నారు.

## ఎయిమ్స్ సారథ్యంలో యోగా దినోత్సవం



ప్రజాపక్షం/బీబీనగర్ : బీబీనగర్‌లోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) సారథ్యంలో భువనగిరిలోని తెలంగాణ సాయుధ దళాల ప్రిపరేటరీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. మహిళా సాధికారత కోసం యోగా అన్న అంశం ప్రాధాన్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 70 మంది విద్యార్థినులు యోగా సెషన్ లో పాల్గొన్నారు. ఎయిమ్స్ కార్యనిర్వాహక సంచాలకుడు ప్రొఫెసర్ డాక్టర్ వికాస్ భాటియా నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ వర్గీస్ మహిళా సాధికారతలో యోగా ఎలా ఉపయోగపడుతున్నదని సోదాహరణంగా వివరించారు. ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేశ్వర్ లక్కిరెడ్డి యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ఎలా పెంపొందిచ్చుకోవచ్చునన్న అంశంపై ఆహుతులకు అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి ఝాన్సీ మాట్లాడుతూ మహిళల ఆత్మ, శరీరం, మనస్సును సుసంపన్నం చేయడంలో యోగా పాత్రపై తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోవిందరావు, అదనపు నోడల్ అధికారి డాక్టర్ వందన, డాక్టర్ సాయిలు, నీరజ డాక్టర్ వసంత్, మొత్తం 70 మంది కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## భువనగిరి కోర్టు ఆవరణలో యోగా దినోత్సవం



ప్రజాపక్షం/భువనగిరి : తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశానుసారం అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా శుక్రవారం భువనగిరి కోర్టు ఆవరణలో యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు స్వయంగా శీర్షాసనం వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ శారీరక వ్యాయామం చేయాలని, మానసిక వత్తిడిని యువత ఎదుర్కొలేకపోతుందని, ధ్యానంతో మనసును కట్టడి చేసి మంచి మార్గం వైపు పయనించాలని సూచించారు. మాదక ద్రవ్యాలు, నేర ప్రవృత్తి విడనాడాలని, యోగ, ధ్యాన కార్యక్రమాలు మరిన్ని చేసే విదంగా యోగ సంస్థలు తమ సేవలను విస్తృతపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ బోధకులు ఉప్పల రవి, చింత అనిల్, శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ మెడిటేషన్ ధ్యాన బోధకులు చేపూరి నరసింహ చారి, నామోజు నరేష్, బీబీనగర్ ఎస్ఎల్ఎన్ఎస్ నేచర్ క్యూర్ వైద్యశాల డాక్టర్ కార్తిక్ రెడ్డి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్ రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బి.హరినాథ్, కార్యదర్శి కె.కృష్ణ, జి.పి నాగారం అంజయ్య, న్యాయవాదులు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది ఎస్. జైపాల్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి. శంకర్, పాల్గొన్నారు.

## వైబ్రా కార్మికులను ఆదుకోవాలని కలెక్టర్ వినతిపత్రం



ప్రజాపక్షం/బీబీనగర్ : మండల కేంద్రంలో గత 12 సంవత్సరాల క్రితం పరిశ్రమ మూసివేసి కార్మికుల బకాయిలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు బిజెపి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ ఆధ్వర్యంలో వైబ్రా కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి బద్దం బిక్షపతి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాశం భాస్కర్ మాట్లాడుతూ వైబ్రా కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చెంద మహేందర్ గుప్త కార్యక్రమంలో వైబ్రా కార్మికులు మాటూరు బిక్షపతి సంధి గారి కృష్ణ పాల్గొన్నారు.

## కొర్ర పత్తి ఆశయాలు సాధిద్దాం



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం: మండలంలోని చిల్లాపురం గ్రామంలో కొర్ర పత్తి 27వ వర్ధంతిని ఆయన స్తూపం వద్ద ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ మాట్లాడుతూ కొర్ర పత్తి మన మధ్యన లేకపోయినా ఆయన కలలు కన్నా సమ సమాజం ఆయన ఆశయాలు సజీవంగానే ఉన్నాయని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులునల్లవెల్లి ముత్యాలు, మారగోని జంగయ్య, జక్కులి బాలయ్య, బొడ్డు లింగస్వామి, దుబ్బాక పెంటయ్య, కొర్ర పత్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కూలీలకు యోగా ప్రాముఖ్యతను వివరించిన డిఆర్డిఓ సురేష్

ప్రజాపక్షం/వలిగొండ : ప్రపంచ యోగ డే పురస్కరించుకొని శుక్రవారం వలిగొండ మండలం రెడ్ల రేపాక గ్రామంలో అడిషనల్ డిఆర్డిఓ సురేష్ కూలీలకు యోగ ప్రాముఖ్యతను వివరిస్తూ వారితో యోగ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఒక 20 నిమిషాలు యోగాసనాలు చేయడం వలన ఆరోగ్యవంతులుగా ఉంటూ, కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నోముల మల్లేష్, ఏపీఓ పరశురాములు, ఇంజనీరింగ్ విక్రమ్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకన్న, ఫీల్డ్ అసిస్టెంట్ సునీత పాల్గొన్నారు.

## మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బహిరంగ వేలం



ప్రజాపక్షం/వలిగొండ : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీమత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానముకు 202425 సంవత్సరమునకు సంబందించిన లైసెన్స్ రైట్స్ నిమిత్తం సీల్ టెండర్స్‌కు బహిరంగ వేలము ఈనెల 28న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మోహన్ బాబు తెలిపారు. ఆసక్తి గలవారు బహిరంగ వేలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

## అనుమతులు లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : అనుమతులు లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో విచ్చలవిడిగా పర్మిషన్ లేకుండా స్కూలు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటలాడుతున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.సురేష్ యాదవ్, నాయకులు శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన నాయకులు

ప్రజాపక్షం/భువనగిరి : నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను పిసిసి డెలిగేట్ తంగేళ్లపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని తన నివాసంలో కలిసి ఘనంగా శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న ట్రిబుల్ ఆర్ రైతులతో ఫోన్లో మాట్లాడారు. ట్రిబుల్ ఆర్ రైతులు నష్టపోయిన వారందరినీ, తన నివాసానికి వస్తే సంబంధిత శాఖ మంత్రితో సహా ముఖ్యమంత్రి దగ్గరికి తీసుకెళ్లి వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వారితో ఫోన్లో చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మొలుగు లక్ష్మయ్య, మైనార్టీస్ జిల్లా నాయకులు మమ్మద్ జలీల్, నాయకులు గుమ్మడిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ ఆహార నిరోధక శాఖ అధికారుల తనిఖీలు



ప్రజాపక్షం/ హాలియా: హాలియా మున్సిపాలిటీ పరిధిలో బేకరీలపై జిల్లా ఇంచార్జ్ ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి హాలియా మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీతో కలిసి తనిఖీలు నిర్వహించారు. గురువారం సాయంత్రం నిర్వహించిన నిర్వహించిన ఈతనిఖీలలో అపరిశుభ్రంగా ఉండడంతోపాటు సరైన నాణ్యతలేని పదార్థాలను వినియోగిస్తున్న బేకరీలపై కొరడా ఝుళిపించారు. తనిఖీలో భాగంగా అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు ఫేమస్ బైక్స్ అను బేకరీలో అపరిశుభ్రంగా ఉన్న బేకింగ్ గదులను పరిశీలించి 15వేల రూపాయలు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. అనుమానిత ఆహార నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాదులో గల స్టేట్ ఫుడ్ ల్యాబ్ కి పంపించామని వారు చెప్పారు. ఆ రిపోర్ట్స్ వచ్చిన తర్వాత అవి కల్తీ అని తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్స్ పెక్టర్ స్వాతి తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం జరిపిన అపరిశుభ్రత కలిగి,కల్తీ ఆహారం విక్రయించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై తరచుగా ఆకస్మిక దాడులు కొనసాగుతాయని విక్రయదారులు ముఖ్యంగా హోటల్స్ బేకరీలు, స్వీట్ షాపులు నడిపే వారు ప్రజలకు నాణ్యమైన కల్తీ లేని ఆహారాన్ని అందించాలని చెప్పారు .లేనిచో వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అపరిశుభ్ర వాతావరణం కలిగి ఉన్న బేకరీని మున్సిపల్ కమిషనర్ తాత్కాలికంగా మూసివేశారు. హాలియా పట్టణంలో గల ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టల్లో జిల్లా ఫుడ్ ఇన్స్ పెక్టర్ స్వాతి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి వంట గదిని పరిశీలించడం గమనార్హం.

## ప్రజా వాణిలో పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి



ప్రజాపక్షం/కొండమల్లేపలి: ప్రతి సోమవారం ఉదయం 10.30 నిమిషాల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించే ప్రజా వాణి కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రజలు తమకు లభించనటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలైన గ్యాస్ సబ్సిడి, కరెంట్ బిల్ సబ్సిడి ఇతర సమస్యల పరిష్కారం కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడివో రాంరెడ్డి, ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో మండల ప్రజలను కోరారు. సరైన ధృవ పత్రాలతో తమ సమస్యల పరిష్కారానికి ఎంపిడివో కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే అధికారులు వాటి పరిష్కారానికి మార్గం చూపుతారని వారు పేర్కొన్నారు.

## సబ్ కలెక్టర్ హోదా కల్పించడం హర్షనీయం

ప్రజాపక్షం/కొండమల్లేపలి: దేవరకొండ రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్ హోదాను ప్రభుత్వం కల్పించడం హర్షించదగిన విషయం అని కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు ఏకుల సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. దేవరకొండ డివిజన్‌కు సబ్ కలెక్టర్ హోదా రావడంలో కృషి చేసిన ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్‌కు ఈ సందర్భంగా సురేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా కార్యాలయానికి వెళ్ళకుండా తక్కువ సమయంలో ప్రజలకు దేవరకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమస్యలు పరిష్కారం అవుతాయని సురేష్ పేర్కొన్నారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/చింతపల్లి: మండల ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సక్కుబాయి కోరారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజలకు ప్రజావాణి కార్యక్రమంపై అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి సక్కుబాయి మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ విజయ కుమార్, ఎంపిడిఓ సుజాత, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవలు మరువలేనివి: మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్

ప్రజాపక్షం/వలిగొండ : తెలంగాణ జాతిపిత, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి పురస్కరించుకొని శుక్రవారం వలిగొండ మండలం నాగారం గ్రామంలో మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మొగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా జీవించిన మహానుభావుడు జయశంకర్ అని కొనియాడారు. సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటడంతో పాటు జనాన్ని జాగృతం చేయటంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం



ప్రజాపక్షం/నార్కట్ పల్లి : నీట్ పేపర్ లీకేజీ లో బిజెపి నాయకుల హస్తం ఉందని, ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సిపిఐ(ఎం) మండల కమిటీ సభ్యులు చింతపల్లి బయన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నార్కట్ పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీ మూలంగా 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని అన్నారు తమ పిల్లల మీద ఎంతోమంది తల్లిదండ్రులు మా పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఉత్సాహంతో ఉన్నారు ఆ తల్లి దండ్రులకు మాత్రం చివరికి కన్నీళ్లే మిగిలాయనే అన్నారు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకుని కోచింగ్ తీసుకొని పరీక్షలు రాస్తే చివరి కుంభకోణాలు జరిగి విద్యార్థుల భవిష్యత్తు అంధకరమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ప్రధాని మోడీ పూర్తి బాధ్యత వ్యవహరించి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం పార్టీ మండల కమిటీ సభ్యులు కొప్పు శ్రవణ్, దండు రవి, పల్లె అశోక్ తదితరులు పాల్గొన్నారు

## మోదీ దిష్టిబొమ్మ దగ్ధం



ప్రజాపక్షం/ మునుగోడు : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు పరచి నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మునుగోడు మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కర్నాటి స్వామి యాదవ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నక్క వెంకన్న యాదవ్, మాజీ సర్పంచులు జలా వెంకన్న యాదవ్, మిర్యాల వెంకన్న, పట్టణ అధ్యక్షుడు సాగర్ల లింగస్వామి,బొల్లం వెంకన్న, పాలకూరి యాదయ్య,పందుల సంపత్,జంగిలి నాగరాజు,పందుల భాస్కర్, జిట్టాగోని సైదులు, కాటం వెంకన్న, సులేమాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల కనీసం వేతనం రూ. 18వేలు ఇవ్వాలి...



ప్రజాపక్షం/గుండాల: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని, ఆశా వర్కర్లకు నిర్వహించే పరీక్షలను రద్దు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ సినియరిటి ఉన్న ఆశా వర్కర్లకు కొత్తగా పరీక్షలు నిర్వహిస్తామని, పరీక్షలలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఆశా వర్కర్లకు సర్టిఫికేట్లు ఇస్తామని, ఉత్తీర్ణత సాధించని వారికి విధుల నుండి తొలగిస్తామని ప్రభుత్వం చెప్పడం అన్యాయం అని ఇది వారిని కించపరచడమే అని ఆయన అన్నారు. ఆశా వర్కర్ల సినియరిటిని తగ్గించి, ఉద్యోగ భద్రత లేకుండా చేయడంమే తప్పా మరొకటి కాదని ఆయన అన్నారు. ఆశా వర్కర్లకు నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రింగ్ రోడ్డు కాదు.. దొంగ రోడ్డు



ప్రజాపక్షం/నల్లగొండ : నల్లగొండ చుట్టూ నూతనంగా నిర్మించబోయే ఔటర్ రింగు రోడ్డు కాదు దొంగ రోడ్ అని మాజీ శాసన సభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి ఆరోపించారు. కేవలం రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి తమ అనుచరులకు దోచి పెట్టడానికి 3 ఆప్షన్ తీసుకుని రోడ్డు నిర్మాణం చేపడుతున్న నాటకమన్నారు. మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రింగ్ రోడ్ బాధిత కుటుంబాలతో కలిసి పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి రోడ్డు నిర్మాణం మ్యాప్ వివరాలను వివరించి అనంతరం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ మూడవ ఆప్షన్ ద్వారా ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం చేస్తే సుమారు 3000 కుటుంబాల ప్లాట్లు, ఇండ్లు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. వాటిని పట్టించు కోకుండా అధికారం ఉందనే అహంకారం తో మొండి వైఖరి ప్రదర్శిస్తున్నారని బాధితుల గోడు పట్టించుకోవట్లేదని పేర్కొన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి అందరికి ఆమోదయోగ్యమైన ప్లాన్ 1,2, వదిలేసి ప్లాన్ 3 ఎందుకు ఎంచుకుంటున్నారని ప్రశ్నించారు.15 రోజుల సమయం ఇస్తున్నామని ప్లాన్ 3 ఉపసంహారించుకోవాలని లేనిపక్షంలో బాధితుల తరుపున తాము పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రెగట్టే మల్లిఖార్జున్ రెడ్డి, సైదిరెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## సోమవారం నుండి ప్రజావాణి వినతులు స్వీకరణ



ప్రజాపక్షం/మర్రిగూడ: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అన్ని శాఖల అధికారుల తో సమీక్ష సమావేశము నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో సి మున్నయ్య, తాసిల్దార్, బక్క శ్రీనివాసులు అన్ని శాఖల అధికారులకు సోమవారం నుండి ప్రజావాణి వినతులు స్వీకరించే అందుకు మండల పరిషత్తు కార్యాలయములు విధులు నిర్వహించాలని, ప్రజలు ఇచ్చే ప్రజావాణి వినతులు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమములో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

ప్రజాపక్షం/చండూరు: చండూరు మండలం బంగారిగడ్డలో పేకాట ఆడుతున్న 8 మందిని పట్టుకొని అరెస్ట్ చేసి కేసును నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వారి వద్ద లభించిన 2980 రూపాయల నగదు, 6సెల్ ఫోన్లు, 8 బైక్‌లను సీజ్ చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉపేంద్ర చారి, సురేష్ , ఆనందరెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం

ప్రజాపక్షం/దేవరకొండ; ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఈ ప్రజావాణి కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి ఇందిర, అసిస్టెంట్ డైరెక్టర్ (వెటర్నరీ) ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని మండల స్థాయి అధికారులు తహశీల్దార్, ఎంపిడివో, వ్యవసాయ అధికారి, ఐకేపి, ఏపిఎం, ఎంపివో, ఎంఈవో, ఎలక్ట్రీసిటి ఏఈ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని, ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సమయపాలన పాటించాలని, మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రజావాణితో సమస్యల యొక్క పిటిషన్‌లను అందించే సమయంలో దరఖాస్తు ఫాం, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను ఇవ్వాలని ఎంపిడివో సుదర్శన్‌రెడ్డి, తహశీల్దార్ సంతోష్‌కిరణ్‌లు తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల నజర్

**ప్రజాపక్షం/హాలియా:** అక్రమ ఇసుక రవాణా చేస్తున్న దళారులకు పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తూ కేసు నమోదు చేస్తున్న తీరుతో అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట పడింది. నియోజకవర్గం లోని వివిధ గ్రామాలలో మైనింగ్ శాఖ అధికారులు కొన్ని ఇసుక రీచ్ లను ఏర్పాటు చేశారు. వీటిని గత నెల సరైన ఆర్డర్స్ లేక నిలిపి చేశారు. ఇదే అదునుగా భావించిన అక్రమ ఇసుక వ్యాపారులు పోలీసుల కళ్ళు కప్పి అక్రమ ఇసుక వ్యాపారాన్ని చేపట్టారు. దీంతో పోలీస్ అధికారులు అక్రమ ఇసుక రవాణా అడ్డుకట్టకు చర్యలు చేపట్టారు. ఆన్లైన్ ఇసుక ప్రారంభం అయ్యాక అనుమతి లేని ట్రాక్టర్లు కూడా అక్రమ ఇసుక వ్యాపారాన్ని కొనసాగిస్తున్నరన్న ఫిర్యాదులు పోలీసు



లకు వెల్లువెత్తడంతో హాలియా సీఐ జనార్దన్ గౌడ్, ఎస్ఐ సతీష్ రెడ్డిలు అక్రమ ఇసుక వ్యాపారాన్ని సాగిస్తున్న దళారులపై నజర్ పెట్టారు. దీంతో పోలీసులు వివిధ పద్ధతుల ద్వారా సమాచారాన్ని సేకరించి అక్రమిస్తూ వ్యాపారాన్ని సాగిస్తున్న దళారులకు అడ్డుకట్ట వేసింది. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పాలెం, చింతగూడెం, పులిమామిడి, అనుముల తదితర గ్రామాల నుండి విచ్చలవిడిగా వస్తున్న అక్రమ ఇసుకకు అడ్డుకట్ట పడినట్టు అయింది. దీనివలన ఆన్లైన్లో ఇసుక బుక్ చేసుకున్న యజమానులకు ప్రభుత్వ ధరల ప్రకారం ఇసుక సకాలంలో అందుతున్నట్లు మైనింగ్ అధికారుల ద్వారా తెలుస్తుంది. గతంలో విచ్చలవిడిగా ఇసుక దళారులు వ్యాపారాన్ని కొనసాగిస్తున్న తీరుపై దృష్టి పెట్టిన హాలియా పోలీసులు క్రమక్రమంగా వారి ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డిఎఓ, హెచ్‌డబ్ల్యూఓ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** టిఎస్ పిఎస్‌సి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంతో పాటు కోదాడలో నిర్వహించే డిఎఓ, హెచ్డబ్ల్యూఓ పరీక్షలను అధికారులు సమన్వయంతో సజావుగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌డబ్ల్యూఓ పరీక్షలు జూన్ 24 నుండి 29తేదీ వరకు కోదాడ, సూర్యాపేట కేంద్రాల్లో 2780 మంది అభ్యర్థులు ఉదయం, మధ్యాహ్న పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. డిఏఓ పరీక్ష ఈనెల 30 నుండి జూలై 4వ తేదీ వరకు సూర్యాపేట, కోదాడ కేంద్రాల్లో 2025 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఉదయం 10:00 గంటల నుండి 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల మౌళిక వసతులు కల్పించాలన్నారు. కోదాడలో నాలుగు కేంద్రాలు, సూర్యాపేటలో ఒక కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలు రాసే అభ్యర్థులు ఒక రోజు ముందుగానే పరీక్ష కేంద్రాలను పరిశీలించుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో డిజిటల్ వాచ్, సెల్ ఫోన్లు, ట్యాబ్, పెన్ డ్రైవ్‌లు, ఫౌచ్, రైటింగ్ ప్యాడ్లు, క్యాలిక్యులేటర్లు, బూట్లుతో పాటు ఎలక్ట్రానికి వస్తులు అనుమతించవద్దని చెప్పారు. మహిళలు ఆభరణాలు, మెహంది పెట్టుకోవద్దన్నారు. అధికారులు సమన్వయంతో బాధ్యత



యుదంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, పరీక్షల విభాగం పర్యవేక్షకులు పద్మరావు, ఏఓ సుదర్శన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలో వడ్డెర బస్తి కాలనీలో డీఎంకే నిధుల కింద సిసి రోడ్డు పనులకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎజాస్, ఒకటో వార్డు కౌన్సిలర్ చింతలపాలె సునీత శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వల్లపు ఉప్పలయ్య, పోరెల్ల సతీష్, ఆంజనేయులు, మల్లెల శ్రీకాంత్, బీజాన భాస్కర్, ఆలేటి పాండు, యాదగిరి, సత్తయ్య, శ్రీను, కుమార్, సిద్ధులు, రాజు, అశోక్, గణేష్, విజయ్, శ్రీధర్, భాస్కర్, క్రాంతి పాల్గొన్నారు.

## సోమమ్మ మరణం సిపిఐకి తీరనిలోటు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(గరిడేపల్లి):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,ఈ ప్రాంత కమ్యూనిస్టు నిర్మాణంలో కీలక భూమిక పోషించిన కామ్రేడ్ కందుల సోమమ్మ మరణం సిపిఐ పార్టీకి తీరనిలోటు అని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు.శుక్రవారం మండలంలోని వెలిదండ గ్రామంలో అమరులైన కామ్రేడ్



కందుల సోమమ్మ మృతదేహాన్ని ఆయనతో పాటు సిపిఐ నాయకులు సందర్శించి ఎర్రజెండాను ఉంచి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ముఖ్యులైన కామ్రేడ్ ఈన్నయ్య సతీమణిగా పార్టీ ఉద్యమాలలో చురుకుగా పాల్గొని తన ఆస్తులను కూడా పార్టీ అవసరాలకు వినియోగించిన వ్యక్తి కామ్రేడ్ సోమమ్మ అన్నారు.నివాళులర్పించిన కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య,శాఖ కార్యదర్శి మామిడి శ్రీను,కందుల వెంకటేశ్వర్లు,చెనగాని సాంబయ్య,ఆదూరి కోటయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ సాధనకి జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు జయశంకర్‌సార్

**ప్రజాపక్షం/కోదాడః** తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేసి తెలంగాణ సాధన కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్‌సార్ అని పలువురు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు.శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ందు ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు డాక్టర్ బ్రహ్మం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయశంకర్ సార్ త్యాగంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి,కందుల కోటేశ్వరరావు,రాయపూడి వెంకటనారాయణ,గుండెల సూర్యనారాయణ,షఫీ,గంధం యాదగిరి, బాగ్దాద్, బషీర్,మోత్కురు వీరభద్రచారి,రేవూరి సత్యనారాయణ,గొల్లపల్లి అనిల్,రేవూరి వెంకటాచారి,చెన్నమల్లు నరసింహాచారి, పంది తిరుపతయ్య,ప్రకాష్,నరసింహాచారి,గురువారెడ్డి,అంజయ్య,సీతారామచారి,దేవచారి,తిరుపతి చారి పాల్గొన్నారు.



## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ యోగ గురువు శంకరయ్య యోగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ వారితో చేయించారు. యోగ భారతదేశ వారసత్వ సంపదగా అభివర్ణించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి మాట్లాడుతూ యోగ తనువును మనసును ఏకం చేసే అద్భుతమైన ప్రక్రియగా పేర్కొన్నారు.ఆరోగ్యవంతమైన జీవితానికి ప్రతి ఒక్కరి దినచర్యలో యోగ భాగం కావాలని కోరారు. అనంతరం ఓఎస్‌డి ఆచార్య కొప్పుల అంజి



రెడ్డి భారత నారి యోగాను ఆచరిస్తూ ప్రపంచానికి ఆదర్శవంతంగా నిలవాలని కోరారు. అనంతరం మద్దిలేటి ప్రధానాంశమైన మహిళ సాధికారతకు యోగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి, ఓ ఎస్ డి టు విసి ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ డా ప్రేమ్ సాగర్, మారం వెంకటరమణారెడ్డి , స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ డా హరీష్ కుమార్ , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నీలకంఠం శేఖర్ డా స్వప్న, సైదులు, సుధాకర్ అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

మండల స్థాయిలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టుల పిల్లలు ప్రవేట్ స్కూల్లో అధిక ఫీజులు చెల్లించలేక చాలా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జర్నలిస్టు పిల్లలకు 50 ఫీజు రాయితీ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పులిమామిడి మహేందర్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు దోటి శ్రీను కార్యదర్శి అశోక్ కుమార్, స్మాల్ అండ్ డైలీ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పిట్టల రామకృష్ణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మదనాచారి, గంగాధర్ వెంకటేశ్వర్లు, కట్టా సుధాకర్, గుడిపాటి శ్రీను, రెడ్డిపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు పడాలని బొడ్రాయికి జలాభిషేకం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** వర్షా కాలంలో వానలు కురవక పోగ, ఎండలు వేసవి కాలాన్ని తలపిస్తుండడంతో రైతుల ఆశలు ఆవిరై పోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండలు తగ్గి, సకాలంలో వర్షాలు పడాలని రైతు చేను కలకలలడాలని పాడి పంటలతో ఆనందం గా ఉండాలని నార్కట్ పల్లి గ్రామస్థులు గ్రామ బొడ్రాయి కి ప్రతి ఇంటి నుండి ఒక బిందెడు నీళ్లు పోయాలని పట్టణ మాజీ ఎంపీటీసీ 1 రాధారాపు విజయలక్ష్మి బిక్షపతి లు ఇట్టి కార్యక్రమానికి పూనుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్సు స్టాండ్ వెనుక కల గ్రామ బొడ్రాయి కీ ప్రతి ఇంటి నుండి తీసుకొచ్చిన బిందెడు నీళ్లతో జాలాభిషేకలు మహిళలు చేశారు. అదేవిధంగా వర్షా భావ పరిస్థితులు నెలకొన్ని సమృద్ధిగా వర్షాలు కురువాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## 10 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని వలిగొండ ఎస్సై డి.మహేందర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వివరాల ప్రకారం అశోక్ లేలాండ్ గూడ్స్‌లో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యంను హైదరాబాద్ కు చెందిన మహమ్మద్ సాదిక్ అనే వ్యక్తి భువనగిరికి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## అసెంబ్లీ ఎన్నికలను తలపించిన అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: ది పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సొసైటీ ప్రైవేట్ లిమిటెడ్ నూతన పాలకమండలి ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలను తలపించాయి. శుక్రవారం జరిగిన బ్యాంక్ ఎన్నికలలో 1794 ఓట్లకు గాను 1794 పోలయ్యి 77.96 శాతం నమోదు కాగా 141 ఓట్లు రద్దయ్యాయి. 1653 ఓట్లు సరైనవిగా గుర్తించి లెక్కింపు మొదలుపెట్టి పొద్దు పోయే రాత్రి వరకు కొనసాగింది. రిజర్వుడు స్థానం ఎస్సీ అభ్యర్థి కొండమడుగు ఎల్ల స్వామి 1113 ఓట్లతో డైరెక్టర్‌గా గెలుపొందారు. ప్రత్యర్థి పోవానం శ్రీనివాస్‌కు 530 ఓట్లు వచ్చాయి. పోటీలో ఉన్న చైర్మన్ అభ్యర్థులు కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం, తడక రమేష్, అభ్యర్థులు, డైరెక్టర్లుగా భారత రాజేంద్రప్రసాద్, రాపోలు వేణు ఏలే హరి శంకర్, కుడికాల బలరాం,గుండు కావ్య,కర్నాటి భార్గవిలకు లీడింగులో కొనసాగుతూ గెలుపు అవకాశాలు ఉన్నాయి.

## మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు

**ప్రజపక్షం/వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం గ్రామంలోని శ్రీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 26న 10 గంటలకు దేవస్థానం హుండీలు లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈవో మోహన్ బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారి, రెవెన్యూ అధికారులు, పోలీస్, గ్రామ పెద్దల సమక్షంలో దేవస్థానం ఆధ్వర్యంలో హుండీలు లెక్కింపు నిర్వహించనున్నారు.